క్లుప్తంగా

సాయిబాబా ఆరాధనోత్సవాలు ప్రారంభం



భిక్షాటన చేస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఆరాధన మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మందిర కమిటీ చైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో 36 మంది భక్తులు ఉదయం 7 నుంచి పద్మావతినగర్, ఏసీనగర్, బాలాజీనగర్ పురవీధుల్లో 'శ్రీసాయిభిక్షాటన' నిర్వహించారు. ఉభయకర్తలుగా గునుపూడి వేణుగోపాల్, రాజ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

రెండో రోజు

ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం గంటల వరకు 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి ఇచ్చారు. అనంతరం సుమారు 3 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు మధుసాయి తెలిపారు. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా మోదెం మల్లికార్జునరావు, భారతి, కనిశెట్టి సురేష్‌బాబు, సరస్వతి, నన్నపురెడ్డి సుకన్య వ్యవహరించారు.

భక్తి పారవశ్యం.. సాయినాథుడి సమాధి ఘట్టం

మహాసమాధి (ఆరాధన) మహోత్సవాల్లో భాగంగా సాయినాథుడి సమాధి ఘట్టం ఆద్యంతం భక్తిపారవశ్యంతో సాగింది. 306 జ్యోతుల ప్రజ్వలనతో నక్షత్ర మహాహారతి కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. విశేష పుష్పాలంకరణలో కొలువైన సాయినాథుడిని దర్శించుకునేందుకు తరలి వచ్చిన వేలాది మంది భక్తజనంతో మందిర ప్రాంగణం కళకళలాడింది.

పాతకక్షలతో దాడి

వెంకటాచలం : మండలంలోని ఇడిమేపల్లి గ్రామానికి చెందిన చల్లా శీనయ్యపై అదే గ్రామానికి చెందిన చల్లా కిష్టయ్య, చెంచుబాబు, అన్వేష్‌లు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. చల్లా శీనయ్య, చల్లా కిష్టయ్య మధ్య స్థల వివాదం ఉంది. దీంతో పక్కా ప్రణాళికతో శీనయ్యపై వారు మారణాయుధాలతో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలహారం బహూకరణ



ముత్యాలహారాన్ని అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరుకు చెందిన తోట శివసాయి దంపతులు సోమవారం రూ.10 లక్షల విలువ చేసే ముత్యాలహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలతో దాతలను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నృత్య కళాకారులకు బహుమతుల ప్రదానం



కొడవలూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో 'మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమి' ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఈ బృందంలోని చిన్నారులు అబ్బుర పరిచే నాట్య ప్రదర్శన చేయడాన్ని ప్రశంసిస్తూ కొడవలూరుకు చెందిన నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకి బృందంలోని చిన్నారులకు బహుమతులు అందజేశారు.

భక్తితో మహాసమాధి మహోత్సవాలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో మహాసమాధి మహోత్సవాలను మంగళవారం భక్తితో నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు కాకడ హారతి, 6.30కి స్వామికి పంచామృత అభిషేకం, 8 గంటలకు సహస్ర నామ పూజలు, 9 గంటలకు సామూహిక ధుని పూజలు, 11 గంటలకు స్తవనమంజరి పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థప్రసాద వినియోగం, రాత్రి 7 గంటలకు లక్ష్మీ అష్టోత్తర స్తోత్రం, విష్ణు సహస్రనామ స్తోత్రం, సామూహిక పారాయణం, 7 గంటలకు నెల్లూరు వారిచే భక్తిపాటలు, రాత్రి శేజ్‌హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

- భక్తిశ్రద్ధలతో మహర్నవమి, విజయదశమి వేడుకలు
- వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించిన జగజ్జనని



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అన్నపూర్ణ అలంకారం

నెల్లూరు(బృందావనం): సింహపురిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నగరంలో గత పది రోజులుగా విశేషంగా జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా వివిధ ఆలయాల్లో పలు రూపాల్లో విశేషాలంకారాల్లో కొలువైన అమ్మవారికి భక్తులు దర్శించుకుని ప్రణమిల్లారు. నగరోత్సవాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. నగరంలోని కొన్ని ఆలయాల్లో సోమవారం, మరికొన్ని ఆలయాల్లో మంగళవారం విజయదశమిని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి సందర్భంగా సోమవారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. శమీపూజ, పారువేట, నగరోత్సవం వేడుకగా జరిగాయి. నవాబుపేట శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సోమవారం మహిషాసురమర్దినిగా, మంగళవారం శ్రీభ్రమరాంబికాదేవిగా భక్తులను కటాక్షించారు. శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారు శ్రీఇరుకళల పరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, పూలంగిసేవ, పల్లకిసేవ, లక్ష కుంకుమార్చన, చండీయాగం నిర్వహించారు. మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. నవావరణ పూజ, పుష్పాలంకరణ, చండీహోమం నిర్వహించారు. మంగళవారం శమీపూజ, ఉత్సవం నిర్వహించారు. మూలాపేటలోని శ్రీమత్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు సోమవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. స్టోన్‌హౌస్‌పేట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు సోమవారం ఉదయం గజలక్ష్మిగా, సాయంత్రం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. మంగళవారం విజయదశమి సందర్భంగా శమీపూజ, సాయంత్రం మూలవర్లకు పూలంగిసేవ, రాత్రి అమ్మవారి నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది.



నవాబుపేట శ్రీమత్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని



మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఊంజల్‌సేవ

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



బాలాజీనగర్ సెంటర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బాలాజీనగర్ సీపీఎం సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహం వద్ద, కుక్కలగుంటలోని శ్రీచిన్నమహాలక్ష్మమ్మ ఆలయం, పణతులవారివీధిలోని శ్రీమహాలక్ష్మమ్మ ఆలయం, మల్లెతోటలోని శ్రీభువనేశ్వరి మాత ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మవారి ఆశీస్సులు నిండుగా ఉండాలన్నారు. దుష్టశక్తులపై విజయం సాధించి రాష్ట్రాన్ని విజయవంతంగా పరిపాలించే శక్తియుక్తులు ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు గణేశం సుజాత, పొట్లూరి రామకృష్ణ ఆచారి, వేలూరు మహేష్, సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత చిరమన సురేష్ విజయదశమి సందర్భంగా మంగళవారం 300 మంది కార్మికులకు అన్నదానం చేశారు. అనంతరం స్వీట్స్ పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలను కార్మికులతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

చిన్నారులకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేయూత

- రూ.40 వేల ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): అనంతసాగరం మండలం మినగల్లు గ్రామానికి చెందిన ఇరువురు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి నాన్నమ్మ వద్ద ఉంటున్న నేపథ్యంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో వారికి ఆర్థికసాయం అందజేశారు. మినగల్లు ఎస్సీకాలనీకి చెందిన సూరిపోగు వెంకటేష్ - వెంకటరత్నమ్మ కొద్దిరోజుల క్రితం మృతిచెందారు. వీరి పిల్లలు అనుశ్రీ, వర్ధన్ వాళ్ల నాన్నమ్మ సూరిపోగు ఆదిలక్ష్మి వద్ద ఉంటున్నారు. చిన్నారుల పరిస్థితిని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి రూ.40 వేల చెక్కును వారి నాన్నమ్మకు అందజేశారు.

శ్రీనివాసుడికి ఊంజల్ సేవ



ఊంజల్‌సేవలో శ్రీవారు, అమ్మవార్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని వెంకటేశ్వరపురంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలంకరణ, వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి శమీపూజ, ఊంజల్‌సేవ జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు - కమలమ్మ దంపతులు, వెంకయ్య - రమణమ్మ దంపతులు, కిషోర్‌కుమార్ - సుకన్య దంపతులు, నరసింహరావు - సామ్రాజ్యలక్ష్మి దంపతులు, వెంకటేశ్వర్లు - లావణ్య దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొరసాల నాగిరెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుకాణాల్లో చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీ సెంటర్‌లోని పలు దుకాణాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, సామగ్రి దోచుకెళ్లారు. వివరాలు.. జనార్దన్‌రెడ్డికాలనీ సెంటర్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్న అన్సర్ ఆదివారం రాత్రి దుకాణానికి తాళం వేసి తిరిగి సోమవారం ఉదయం దుకాణం తెరిచే సరికి దుకాణం పైన రేకులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. దుకాణంలో ఉన్న రూ.10 వేల విలువైన సిగరెట్లు, కిళ్లీ సామగ్రితో పాటు రూ.12 వేల నగదును దుండగులు అపహరించినట్లు గుర్తించి నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే ప్రాంతంలో ఓ ఎలక్ట్రికల్ దుకాణం, మరో చిల్లర దుకాణంలో కూడా చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. రోజూ ఈ ప్రాంతంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కొంతమంది యువకులు మద్యం, గంజాయి సేవించి తిరుగుతూ, అవకాశం ఉన్న దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీని పటిష్ట పరిచి రక్షణ కల్పించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

ఇండోర్ సబ్‌స్టేషన్‌లో విజయదశమి పూజలు



సబ్‌స్టేషన్‌లో ఆయుధపూజ చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు పలు విద్యుత్ ఫీడర్లకు ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ విజయ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, జేఎల్‌ఎంలు, ఏఎస్‌ఎంలు, గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవీడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిన్నయ్య



పొదిలి చిన్నయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ వాహనాల డ్రైవర్స్(జీవీడీ) సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొదిలి చిన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నికను నిర్వహించారు. ఏకగ్రీవంగా పొదిలి చిన్నయ్యను కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల చిరంజీవి, ముఖ్య సలహాదారుడు ఆలపాటి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఈవీఎం శరత్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఎంప్లాయీస్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్య, కార్యదర్శి సురేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొదలి చిన్నయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్యను ప్రభుత్వ వాహనాల డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

కళాత్మకంగా దసరా శుభాకాంక్షలు



రావి ఆకుపై మహిషాసురమర్దిని



మర్రి ఆకుపై దుర్గాదేవి రూపం

నెల్లూరు(బృందావనం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఇరువురు కళాకారులు కళాత్మకంగా శుభాకాంక్షలు తెలిపారు. మహర్నవమిని పురస్కరించుకుని నగరంలోని హరనాథపురానికి చెందిన కళాకారుడు సోమా పద్మారత్నం రావి ఆకుపై కార్వింగ్‌తో వ్యాఘ్రంపై మహిషాసురమర్దిని అలంకారంలో ఉన్న అమ్మవారిని తీర్చిదిద్దారు. అలాగే మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకుపై కార్వింగ్‌తో దుర్గాదేవి రూపాన్ని తీర్చిదిద్దారు.

రూరల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట) : నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని జేసీఎస్ కో–ఆర్డినేటర్ చేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, రూరల్ పార్టీ అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా రూరల్ ప్రాంతానికి సంబంధం లేని కొందరు వ్యక్తులు పసలేని ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. కందమూరులో నిరసన తెలిపిన జనసేన నేత కిశోర్‌కు రూరల్‌లో ఎన్ని గ్రామాలు ఉన్నాయో తెలుసా అని ప్రశ్నించారు. వారు చేసిన ఆరోపణలను నిరూపిస్తే వైఎస్సార్‌సీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తానని చేరెడ్డి సవాల్ విసిరారు. రూరల్ ప్రాంతానికి రూ.34.78 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత ఎంపీ ఆదాలకు దక్కుతుందని, తమతో వస్తే క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధిని చూపిస్తామన్నారు. అభివృద్ధిపై పసలేని ఆరోపణలు చేయడం మాని, మా సవాల్‌ను స్వీకరించాలన్నారు.

సింహపురి మేకప్ ఆర్టిస్టు ఎంపిక

నెల్లూరు(బృందావనం): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మలేసియాలో ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శితం కానున్న 'శ్రీశ్రీనివాస కల్యాణం' నృత్య రూపకానికి మేకప్ అందించేందుకు నెల్లూరుకు చెందిన నంది అవార్డు గ్రహీత, సురభి మేకప్ ఆర్టిస్టు వనారస లక్ష్మీకాంతబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన అన్నమయ్య ట్రస్ట్ కన్వీనర్ సునీత ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ప్రదర్శితం కానుందని ఆయన తెలిపారు.